క్లుప్తంగా

ఏసీడీ చార్జీలు ఉపసంహరించుకోవాలి

నడికూడ : విద్యుత్ శాఖ వినియోగదారులపై మోపిన ఏసీడీ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ బీసీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏసీడీ పేరుతో ప్రజలపై భారాలు మోపేందుకు తెగబడుతోందని విమర్శించారు. పెట్రోల్, గ్యాస్, డీజిల్, ఇతర నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ప్రజలు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడుతుండగా విద్యుత్ ఏసీడీ పేరుతో మళ్లీ భారాలు మోపడం సరికాదని పేర్కొన్నారు. ఏసీడీ చార్జీలను ఉపసంహరించుకోకపోతే పోరాటాలు తప్పవని స్పష్టం చేశారు.

నేడు ఎమ్మెల్యే రాక

ఎల్కతుర్తి : ఈనెల 23న (సోమవారం) మండల కేంద్రానికి హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, హనుమకొండ జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్ రానున్నట్లు ఎంపీపీ మేకల స్వప్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, శ్రేణులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపు భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలు

శాయంపేట : మండల కేంద్రంలోని శివ మార్కండేయ ఆలయంలో ఈనెల 24న భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాశ్ ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. 24న ఉదయం 5 గంటల నుంచి సుప్రభాత సేవ, శివలింగానికి, మార్కండేయ స్వామికి పంచామృత అభిషేకాలు, మార్కండేయ స్వామి వైభవ వ్రతం, మృత్యుంజయ హవనం, అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామంలో మార్కండేయ స్వామి శోభయాత్ర నిర్వహించనున్నట్లు వివరించారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

26న అక్షరాభ్యాస మహోత్సవం

పరకాల : వసంత పంచమి సందర్భంగా ఈనెల 26న పట్టణంలోని శ్రీసరస్వతీ శిశు మందిర్‌లో అక్షరాభ్యాస మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రధానాచార్యులు మేకల సంపత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహోత్సవంలో పాల్గొనే ఆసక్తి కలిగిన పిల్లల వివరాలను సెల్ నెంబర్ 8897675391లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు.

కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఓదెలు



కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా పోతిరెడ్డి ఓదెలు ముదిరాజ్‌ను ఎన్నుకున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, హుజూరాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్ బల్మూరి వెంకట్ ఆదేశాల మేరకు టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ తొటం రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు దేశిని అయిలయ్య గౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా ఓదెలును, ఉపాధ్యక్షుడిగా వేల్పుల చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుండపు చరణ్‌పటేల్ ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు కొండ రమేష్, అమృత మల్లయ్య, సముద్రాల కృష్ణ, సముద్రాల రమేష్, బోయిని హనుమాన్ ప్రసాద్, కొండపాక మనీష్ తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాలకు పాల్పడుతున్న పాలకులు



హన్మకొండ చౌరస్తా /హన్మకొండ అర్బన్: భూకబ్జాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించే సమయం దగ్గర్లోనే ఉందని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ విమర్శించారు. హనుమకొండలోని హనుమాన్ టెంపుల్ కూడలిలో బీఆర్ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరంగల్ నగరంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులే భూబకాసురులుగా మారి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మురళీధర్‌గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎం చుక్కయ్య

ధర్మసాగర్ : ఐక్యఉద్యమాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారమౌతాయని ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా నాయకుడు ఎం.చుక్కయ్య స్పష్టం చేశారు. మండల కేంద్రంలో బొల్లం సాంబరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ప్రజాసంఘాల సమావేశానికి ముఖ్యఅతిథిగా చుక్కయ్య హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల, వ్యవసాయ కార్మికుల వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తున్నాయని ధ్వజమెత్తారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ కార్మికులకు ఏటా 200 రోజులు పని దినాలు కల్పించి రోజువారి కూలీ రూ.600 చొప్పున చెల్లించాలని, రైతులకు ఏకకాలంలో రుణమాఫీ వర్తింపజేయడంతోపాటు మళ్లీ పంట రుణాలివ్వాలని, పురుగు మందులకు సబ్సిడీ పెంచాలని, గొర్రెల మేకల పెంపకందారులకు గొర్లకు బదులు నగదు బదిలీ చేయాలని, చనిపోయిన గొర్లకు సంబంధించి ఇన్సూరెన్స్ ఇవ్వాలని, పెంపకందార్లకు ప్రమాదబీమా రూ.10 లక్షలు చెల్లించాలని, గొర్ల మేత కోసం బంజరు భూములు కేటాయించాలని, ఇల్లు లేని పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టించాలని, చేతి వృత్తిదారులకు బీసీ రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం వ్యవసాయ కార్మికులు, రైతులు, గొల్లకురుములు, అన్ని తరగతుల ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా రాఘవులు, కోకన్వీనర్లుగా సాంబరాజు, రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ లింగయ్య, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి సాంబయ్య, నాయకులు సాంబరాజు, రమేష్, సమ్మయ్య, మోడెం రాజేశ్వరి, ప్రమీల, వలపు రమేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదరణ ఓర్వలేకే విమర్శలు



సమావేశంలో మాట్లాడుతున్న పృథ్వీరాజ్

భీమదేవరపల్లి : ప్రజాదరణను ఓర్వలేకే బీజేపీపై కాంగ్రెస్, బీఆర్ఎస్ విమర్శలు చేస్తున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపల్లి పృథ్వీరాజ్ తెలిపారు. మండలంలోని ముల్కనూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఊసకోయిల ప్రకాష్, అదే పార్టీకి చెందిన మాణిక్యాపూర్ ఎంపీటీసీ మామిండ్లపల్లి గోపిశర్మ ఇటీవల బీజేపీలో చేరగా వారిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శలు చేయడం సరికాదన్నారు. గతంలోనూ పలువురు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు ఇతర పార్టీల్లో చేరారని గుర్తు చేశారు. అప్పుడు మాట్లాడకుండా ఇప్పుడు విమర్శలు చేయడం తగదన్నారు. బీజేపీతోనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని చెప్పారు. ప్రజలు బీజేపీని ఆదరిస్తున్న క్రమంలోనే ఇతర పార్టీల నుంచి చేరికలు సాగుతున్నాయని తెలిపారు. బీజేపీలో చేరిన వారిపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో బీజేపీ అనుబంధ మహిళా మోర్చా అధ్యక్షురాలు అంబీరు కవిత, నాయకులు శ్రీరామోజు శ్రీనివాస్, దొంగల వేణు, నేతుల మోహన్, శ్యాం, బిట్టు, రవి పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌కు ఎమ్మెల్సీ పరామర్శ



రవీందర్‌రావును పరామర్శిస్తున్న కడియం శ్రీహరి

ఐనవోలు : డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావును మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి పరామర్శించారు. కడియం శ్రీహరి మండలానికి చేరుకుని రవీందర్‌రావు ఇంటికి వెళ్లి కలిశారు. ప్రమాదం జరిగిన తీరుపై అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం బారిన పడడం బాధాకరమన్నారు త్వరగా కోలుకుని ప్రజల్లోకి రావాలని ఆకాంక్షించారు. జఫర్‌గఢ్, హసన్‌పర్తి, స్టేషన్ ఘన్‌పూర్ సొసైటీల చైర్మన్లు కరుణాకర్, ఉదయ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, రాయపర్తి సర్పంచ్ గ్యార నర్సయ్య, తదితరులు మార్నేని రవీందర్ రావును మండల కేంద్రంలోని నివాసంలో వేర్వేరుగా కలిసి పరామర్శించారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం



డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సుమలత, ఎంపీపీ అనసూర్య

నడికూడ : మండలంలోని చర్లపల్లి గ్రామంలో చేపట్టిన సైడ్ డ్రెయినేజీ నిర్మాణ పనులను జెడ్పీటీసీ కొడెపాక సుమలతతో కలిసి ఎంపీపీ మచ్చ అనసూర్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అనసూర్య మాట్లాడారు. జెడ్పీటీసీ రూ.4 లక్షలు, ఎంపీటీసీ రూ.3 లక్షలు కేటాయించగా పనులు చేపట్టినట్టు తెలిపారు. అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని చెప్పారు. అనంతరం ఆమె స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు రావుల చాడ తిరుపతిరెడ్డి,, తిప్పర్తి సాంబశివ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి, గణపతిరెడ్డి, జయపాల్‌రెడ్డి, బొల్లారం అనిల్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక భరోసా.. సీఎంఆర్ఎఫ్



ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే, మేయర్

హసన్‌పర్తి: పేదల వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి.. ఆర్థిక భరోసా అని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. 55వ డివిజన్ భీమారానికి చెందిన విజయలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతుండగా, రూ.లక్ష ఎల్ఓసీని హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని తన నివాసంలో నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి ఎమ్మెల్యే ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రజిత, కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, రైతుబంధు సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు విక్టర్‌బాబు, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారులకు అభినందనలు

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 5నుంచి 8వరకు హైదరాబాద్‌లోని ఖుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగిన జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో హనుమకొండ డీఎస్ఏ క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. కబ్స్ ఏజ్ గ్రూప్‌లో 36, 38 కిలోల విభాగంలో ఎస్‌కె.షోయేబ్ బ్రాంజ్ మెడల్ సాధించగా, 38, 40 కిలోల విభాగంలో అక్షయ్‌ఖాన్ బ్రాంజ్, 40, 42 కిలోల విభాగంలో ఎస్‌కె.రిజ్వాన్ సిల్వర్ మెడల్స్ అందుకున్నారు. సబ్ జూనియర్ విభాగంలో ఎస్‌కె.షాహెద్ బంగారు, 71కిలోల విభాగంలో కార్తికేయ బంగారు, 77కిలోల విభాగంలో శివ బంగారు పతకాన్ని సాధించారు. ఈమేరకు క్రీడాకారులను, కోచ్ శ్యాంసన్‌ను మున్సిపల్ కమిషనర్ ప్రావీణ్య అభినందించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



వర్మకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

హన్మకొండ: ఎస్సీ వర్గకరణ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈమేరకు కేంద్ర సహకార, ఈశాన్య రాష్ట్రాల సహాయమంత్రి బి.ఎల్.వర్మకు వినతిపత్రం అందజేశారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో కేంద్ర మంత్రిని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని కేంద్రం ఇచ్చిన హామీ అమలయ్యేలా చూడాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మంద కుమార్‌మాదిగ ఎమ్మార్పీఎస్ నాయకులు జన్ను దినేష్‌మాదిగ, మంద రాజుమాదిగ, గద్దల సుకుమార్ మాదిగ, వస్కుల ప్రణయ్ మాదిగ, మంద వర్ధన్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

భర్తపై భార్య ఫిర్యాదు

నడికూడ : తన భర్త ప్రభాస్ తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడంటూ దామెర పోలీస్‌స్టేషన్ పరిధిలోని నడికూడ మండలం కౌకొండ గ్రామానికి చెందిన చుక్క రమ్య పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసింది. రమ్యను ప్రభాస్ ఆదివారం కొట్టి ఇంట్లో బంధించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఇన్‌చార్జ్ ఎస్సై అనిల్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అనిల్ వివరించారు.

బాలుడి అదృశ్యం.. ఛేదించిన పోలీసులు

దామెర : బాలుడు అదృశ్యం కాగా రెండు గంటల వ్యవధిలోనే ఛేదించిన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం.. శాయంపేట మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బొమ్మకంటి రాహుల్ దామెర మండలంలోని ల్యాదెళ్లలోని వికాస్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవుల అనంతరం పాఠశాలకు వెళ్లడానికి ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయల్దేరాడు. అనంతరం సింగరాజుపల్లిలోని తన అత్తమ్మ ఇంట్లో భోజనం చేసి పాఠశాలకు వెళ్తానని చెప్పి బయటకు వచ్చాడు. కాగా ఆరోజు సాయంత్రం వరకు రాహుల్ పాఠశాలకు రాలేదని పాఠశాల నిర్వాహకులు అతడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో తోటి విద్యార్థుల, బంధువుల ఇళ్లలో వెతికారు. అయినా బాలుడి ఆచూకీ లభించలేదు. దీంతో రాహుల్ తల్లిదండ్రులు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎస్సై అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టి రెండు గంటల వ్యవధిలోనే రాహుల్ హనుమకొండ ములుగు రోడ్డులోని గార్డియన్ ఆస్పత్రి వద్ద ఉన్నట్లు గుర్తించారు. వెంటనే బాలుడిని అతడి కుటుంబీకులకు అప్పగించారు. పోలీసులకు బాలుడి కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ కన్వీనర్ వెంకటస్వామి సస్పెన్షన్

పరకాల : కాంగ్రెస్ పట్టణ కమిటీ కన్వీనర్ దుబాసి వెంకటస్వామిని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి సస్పెండ్ చేశారు. ఈ మేరకు రాజేందర్‌రెడ్డి ఆదివారం ప్రకటన విడుదల చేశారు. వెంకటస్వామి పార్టీ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న క్రమంలో సస్పెండ్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

సరైన నాయకుడు లేకే రాజీనామా : వెంకటస్వామి

పరకాల : పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి సరైన నాయకుడు లేకపోవడం వల్లే కార్యకర్తలు సమస్యలతో సతమతమౌతున్నారని, ఆ క్రమంలోనే తాను ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు పట్టణ కమిటీ మాజీ కన్వీనర్ దుబాసి వెంకటస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో కార్యకర్తల సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడైనందువల్లే తాను కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి ఈనెల 23న (సోమవారం) మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి సమక్షంలో బీజేపీ చేరనున్నట్లు వివరించారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

వరంగల్: దేశాయిపేటలోని సీకేఎం కళాశాలలో 1991 –1994లో డిగ్రీ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. అక్షయపాత్ర కార్యక్రమానికి రూ.20 వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సి పాల్ సుధాకర్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, టీవీ ఆర్టిస్ట్ డాక్టర్ కాముని శివ కుమార్, వెంకట్రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయుల సదస్సు

హన్మకొండ కల్చరల్: పోతన విజ్ఞానపీఠం ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయుల కవితా సదస్సును ఘనంగా నిర్వహించారు. వరంగల్‌లోని పోతన విజ్ఞానపీఠంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి పీఠం కార్యదర్శి గందె శ్రీనివాస్ సభాధ్యక్షతన వహించగా ముఖ్యఅతిథిగా ఆంధ్ర బాలిక జూనియర్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేశ్వరి పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. తెలుగు భాషలోని మెళకువలను గందె శ్రీనివాస్ వివరించారు. తెలుగు భాషకు సంబంధించిన కార్యక్రమాలను ప్రతినెలా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు పాల్గొని తెలుగు కవితలు, గేయాలు, పద్యాలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో పీఠం కార్యవర్గ సభ్యుడు జూలూరి నాగరాజు, మేనేజర్ జేఎస్.శర్మ వందన సమర్పణ చేశారు.

విహారయాత్రలతో విజ్ఞానం పెంపు

- ప్రముఖ వ్యాపారవేత్త స్వర్గం రవి



విజ్ఞాన విహారయాత్రకు వెళ్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రజాప్రతినిధులు

కమలాపూర్ : విహారయాత్రలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని మండలానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త స్వర్గం రవి తెలిపారు. మండలంలోని ఉప్పల్ జెడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు ములుగు జిల్లాలోని రామప్ప ఆలయ సందర్శన కోసం ఆదివారం బయల్దేరగా బస్సును సర్పంచ్ ఎర్రబెల్లి దేవేందర్‌రావు, మాజీ ఎంపీటీసీ, ఎస్ఎంసీ చైర్మన్ బండారి సుధాకర్, పూర్వ విద్యార్థి కొనుకుల రామచంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. విద్యార్థులను ప్రోత్సహించే దిశగా తన మనుమరాలు రియా (ఎన్ఆర్ఐ, అమెరికా) విహారయాత్ర కోసం సుమారు రూ.35 వేలు తోడ్పాటు అందించిందని చెప్పారు. విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల వెంట ఉపాధ్యాయులు వినయ్‌కుమార్, రాజేందర్, రఘుపతి, శ్రీనివాస్, సదాశివరెడ్డి, మాధవి, దుర్గ, ప్రేమానందం, పాఠశాల సిబ్బంది తదితరులు విహారయాత్రకు తరలివెళ్లారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



పనులు పరిశీలిస్తున్న కమిషనర్, ప్రజాప్రతినిధులు

పరకాల : పరకాల పెద్ద చెరువు సమీపంలోని ఎల్ఐసీ కార్యాలయం నుంచి పెద్దమ్మ తల్లి ఆలయం వరకు చేపట్టిన సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి కోరారు. ఆ రోడ్డు పనులను వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, ఏకు వంశీకృష్ణలతో కలిసి కమిషనర్ ఆదివారం పరిశీలించారు. పనులను సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు స్పష్టం చేశారు. పనులను పర్యవేక్షిస్తూ పరిశీలించాలని స్థానిక కౌన్సిలర్ గొర్రె స్రవంతికి సూచించారు. అనంతరం పెద్దమ్మ తల్లి ఆలయాన్ని పనులను పరిశీలించారు.

ఎమ్మెల్యే సహకారంతోనే అభివృద్ధి



స్తంభాల ఏర్పాటును పరిశీలిస్తున్న సర్పంచ్

నడికూడ : పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సహకారంతోనే అభివృద్ధి జరుగుతోందని సర్పంచ్ ఊర రవీందర్ తెలిపారు. కొద్ది రోజులుగా మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండగా పాత విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాల ఏర్పాటును సర్పంచ్ రవీందర్ ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. రూ.20 లక్షల వ్యయంతో మండల కేంద్రంలో సుమారు 70 నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ధర్మారెడ్డి విశేష తోడ్పాటు అందిస్తున్నారని చెప్పారు. మండల అభివృధికి సహాయ సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డికి రుణపడి ఉంటామని తెలిపారు.

శ్రీకుంకుమేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి



శ్రీకుంకుమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు

పరకాల : పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. కొంత కాలంగా ఆలయం అభివృద్ధి దిశగా దూసుకుపోతోంది. రాష్ట్రంలోని ప్రముఖ శైవక్షేత్రాల్లో పట్టణంలోని శ్రీకుంకుమేశ్వర స్వామి ఆలయం ఒకటి కాగా ఆదివారం నాడు హనుమకొండ, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణం శర్మ స్వాగతం పలికి అర్చనలు చేయించారు.

పేదల వైద్యానికి సర్కార్ పెద్దపీట



హన్మకొండ: చెక్కులను అందిస్తున్న చీఫ్‌విప్

హన్మకొండ: పేదల వైద్యానికి సర్కారు పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండలోని సర్క్యూట్ హౌస్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆరుగురు లబ్ధిదారులకు రూ.10 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న అనేకమంది పేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక వెసులుబాటు అందుతోందని చెప్పారు. కార్పొరేటర్లు ఎలకంటి రాములు, మామిండ్ల రాజు, టీఆర్ఎస్ నాయకులు మాడిశెట్టి శివ శంకర్, నయీమొద్దీన్, సమద్ పాల్గొన్నారు.

కుంగ్‌ఫూ క్రీడాభివృద్ధికి కృషి చేస్తా

కాజీపేట రూరల్: ఎస్‌టీఎఫ్ఐలో స్కూల్ గేమ్‌లో అర్హత సాధించిన కుంగ్‌ఫూ క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని చీఫ్‌విప్ అన్నారు. కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో కుంగ్‌ఫూ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రిఫరీ సెమినార్ ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు కంటేశ్వర్, మాస్టర్లు కిషోర్, కుమారస్వామి, సతీష్, సారయ్య, శ్యామ్‌కుమార్, కృష్ణ, రామకృష్ణ, పాపారావు, విశ్వ, సోని, కళ్యాణి పాల్గొన్నారు.

సమష్టి కృషితో సంఘ అభివృద్ధి

ఖిలా వరంగల్ : సంఘ సభ్యుల సమష్టి పొదుపుతో నేతాజీ ఆదర్శ పరపతి సంఘం అభివృద్ధి చెందిందని సంఘ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు తెలిపారు. వరంగల్ కరీమాబాద్‌లోని నేతాజీ ఆదర్శ పొదుపు, పరపతి పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ భవనంలో ప్రధాన కార్యదర్శి మండ వెంకటేశ్వర్లు అధ్యక్షతన 58వ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించగా ముఖ్యఅతిథిగా సంజయ్‌బాబు మాట్లాడారు. సభ్యుల ఆర్థికశక్తి పెంచేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కోశాధికారి బైరి దయాసాగర్ వార్షిక నివేదిక ప్రవేశ పెట్టగా ఆమోదించారు. సంఘ ప్రతినిధులు రామారావు, చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కోటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పరపతి సంఘాలతో ఆర్థిక పరిపుష్టి

హసన్‌పర్తి : పరపతి సంఘాల ద్వారా ఆర్థిక పరిపుష్టి సాధ్యమని మేయర్ గుండు సుధారాణి అన్నారు. హసన్‌పర్తిలోని భక్త మార్కండేయ పరపతి సంఘం 30వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘాన్ని ఏకతాటిపై నడుపుతున్న సభ్యులను అభినందించారు. సభ్యులకు పదిగ్రాముల బంగారు బిస్కెట్లు అందించారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, సంఘం సభ్యులు దాసరి శ్రీనివాస్, కనుకుంట్ల సతీష్, రాకేష్, దీకొండ భిక్షపతి పాల్గొన్నారు.